

సమ్మక్క బరాజ్ వద్ద నీరులేక ఇసుక దిబ్బగా కనిపిస్తున్న గోదావరి నది

# దేవాదుల ఎత్తిపోతల మోటర్లు బంద్

కన్నాయిగూడెం, మే 7 : మండలంలోని దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టులోని అన్ని మోటర్లను బంద్ చేశారు. బుధవారం గోదావరి నీటిని పంపింగ్ చేస్తున్న చివరి ఫేస్-2లోని ఒక మోటర్‌ను బంద్ చేసినట్లు నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. గోదావరిలో నీటిమట్టం పూర్తిగా తగ్గిపోవడంతో ఒక్కో మోటర్‌ను బంద్ చేస్తూ వచ్చారు. ఇలా ముందస్తుగా బంద్ చేయకపోతే గాలిపట్టి సాంకేతిక సమస్య తలెత్తే అవకాశం ఉందని డీఈ శరత్ తెలిపారు. తుపాకులగూడెం వద్ద గోదావరి నదిపై నిర్మించిన సమ్మక్క బరాజ్ వద్ద నీటినిల్వ పూర్తిగా అడుగంటి ఇసుక దిబ్బలు తేలాయి. ఎగువ నుంచి చుక్కనీరు రావడం లేదని, ప్రస్తుతానికి నీటి నిల్వ చేయకుండా ఒక గేటు పైకెత్తి ఉంచడంతో 200 క్యూసెక్కుల నీరు దిగువకు పోతున్నట్లు బరాజ్ ఏఈఈ సాయిరాం తెలిపారు.

## భక్తులకు తాగునీటి ఇబ్బంది లేకుండా చూడాలి



అధికారులతో చర్చిస్తున్న లోకేశ్

మహదేవపూర్(కాళేశ్వరం), మే 7 : సరస్వతీ పుష్కరాలకు వచ్చే భక్తులకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ, రూరల్ వాటర్ సప్లయ్ ప్రిన్సిపల్ సెక్రటరీ లోకేశ్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన కాళేశ్వరంలో పర్యటించారు. పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం పంచాయతీరాజ్, ఇంజినీరింగ్ శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. పనులు సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఈఎన్‌సీ కనకరత్నం మిషన్ భగీరథ ఈఎన్‌సీ కృపాకర్‌రెడ్డి, అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీఆర్‌డీవో నరేశ్, డీపీవో వీరభద్రయ్య, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎంపీవో ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ పాల్గొన్నారు.

## మహిళా విశ్రాంతి గదులు ప్రారంభం



విశ్రాంతి గదులు ప్రారంభిస్తున్న జీఎం

కృష్ణ కాలనీ, మే 7: సింగరేణి భూపాలపల్లి ఏరియాలోని కేటీకే-5 ఇంక్లైన్‌లో మహిళా ఉద్యోగుల సౌకర్యార్థం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన విశ్రాంతి గదులను బుధవారం ఏరియా జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూపాలపల్లి ఏరియాలోని కేటీకే-5 ఇన్‌క్లైన్ గనిలో ప్రస్తుతం 35మంది మహిళా ఉద్యోగులు ఉన్నారని, వారి సౌకర్యార్థం ప్రత్యేకంగా విశ్రాంతి గదులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం ఎస్ కవీంద్ర, ఏరియా అధికార ప్రతినిధి కే మారుతి, కేటీకే-1 గ్రూప్ ఏజెంట్ జే వెంకటరమణ, పర్సనల్ మేనేజర్ కే మారుతి, గని మేనేజర్ జాకీర్ హుస్సేన్, అధికారులు, గుర్తింపు సంఘం పిట్ సెక్రటరీ తిరుపతి, ప్రాతినిధ్య సంఘం పిట్ సెక్రటరీ రాజు పాల్గొన్నారు.



సమ్మేళనంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు

## పూర్వ విద్యార్థుల సమ్మేళనం

వెంకటాపూర్, మే 7 : ములుగు జిల్లా పాలంపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో 1995-96 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం బుధవారం నిర్వహించారు. 30 ఏళ్ల తర్వాత వారంతా చదువుకున్న పాఠశాలలోనే ఒక చోట చేరి సందడి చేశారు. నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఆనాటి ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఇటీవల మరణించిన పూర్వ విద్యార్థులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చింత నిప్పుల మొగిలి, రఘువీర్, శ్రీనివాస్, సురేందర్, మధుసూదన్, సంపత్, దేవేందర్, రాజేందర్, పూర్వ విద్యార్థులు బూర సమ్మయ్య, అకినపల్లి నాగరాజు, రమేశ్, ప్రసాద్, సతీశ్, రాజిరెడ్డి, ఆసీఫ్ పాషా, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

సెప్టిక్ ట్యాంక్ క్లినర్

SepTeK

★ సెప్టిక్ ట్యాంక్ క్లినర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు.
Cont: 9849145043, 9866584455.
NTW-337056

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565



వీఐపీ పుష్కర ఘాట్ వద్ద ఏర్పాటు చేస్తున్న సరస్వతీ అమ్మవారి విగ్రహం

## సరస్వతీ విగ్రహం ఏర్పాటు

మహదేవపూర్(కాళేశ్వరం), మే 7 : కాళేశ్వరంలో సరస్వతీ పుష్కరాల నేపథ్యంలో వీఐపీ పుష్కర ఘాట్ వద్ద రూ.కోటితో తమిళనాడు రాష్ట్రంలో ప్రత్యేకంగా తయారు చేయించిన 10 ఫీట్ల భారీ సరస్వతీ మాతా విగ్రహాన్ని అధికారులు బుధవారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో స్థపతి వల్లీనాయగం, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# ఏజెన్సీలో గ్రావెల్ దందా

- అనుమతులు లేకుండా అక్రమ తవ్వకాలు
- పట్టించుకోని అధికారులు





గ్రావెల్ తవ్విన ప్రాంతం, గ్రావెల్‌ను టిప్పర్‌లో పోస్తున్న జేసీబీ

వెంకటాపురం(నూగూరు), మే 7 : మండల పరిధిలోని అలుబాక, యాకన్నగూడెం, రామచంద్రాపురం గ్రామాల్లో యథేచ్ఛగా అక్రమ గ్రావెల్ దందా కొనసాగుతోంది. అలుబాక, యాకన్నగూడెం, రామచంద్రపురం గ్రామాల్లో ఇసుక రీచ్‌ల నిర్వహణ కోసం గోదావరి నదిలో గ్రావెల్‌తో రోడ్డు వేసేందుకు సంబంధిత రేసింగ్ కాంట్రాక్టర్ గ్రావెల్‌ను జేసీబీ సాయంతో ప్రభుత్వ భూముల నుంచి అక్రమంగా టిప్పర్లతో తరలిస్తున్నాడని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. కొందరు అధికారులు అక్రమార్కులకు వత్తాసు పలుకుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అధికారుల కనుసన్నల్లోనే గ్రావెల్ దందాకు అక్రమార్కులు తెరలేపారని తెలుస్తున్నది. దీనికి తోడు అధికార పార్టీ నాయకులు అడదండలు ఉండడంతో పగలు రాత్రి తేడా లేకుండా ప్రభుత్వ భూముల నుంచి మట్టిని తరలిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రావెల్ తరలింపుపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా మట్టి తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, గ్రావెల్ మాఫియాపై చర్యలు తీసుకోవాలని సమీప గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## మిషన్ భగీరథ పైపు లైన్‌కు మరమ్మతు

### 'నమస్తే' కథనానికి స్పందన



లీకేజీ వద్ద మరమ్మతు చేస్తున్న సిబ్బంది

మహదేవపూర్, మే 7 : మండల పరిధిలోని సూరారం -రాపల్లికోట ప్రధాన రహదారి పక్కన ఏర్పడిన మిషన్ భగీరథ వాటర్ పైపు లీకేజీకి అధికారులు మరమ్మతు చేయించారు. ఈ నెల 5 న 'నమస్తే తెలంగాణ'లో 'మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ' శీర్షికతో కథనం ప్రచురితమవగా మిషన్ భగీరథ అధికారులు స్పందించారు. బుధవారం డీఈ కిరణ్ కుమార్, ఏఈ వెంకటరమణ ఆధ్వర్యంలో పైపులైన్ లీకేజీని సరిచేసి, నీటి వృథాను అరికట్టారు. దీంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సాంకేతిక నిపుణుడు బాలరాజ్, రాజశేఖర్ పాల్గొన్నారు.

## సమ్మర్ క్రీడల క్యాంపుతో ప్రయోజనం

ఏటూరునాగారం, మే 7 : సమ్మర్ క్రీడా క్యాంపులతో విద్యార్థులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని డాక్టర్ వరప్రసాద్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని క్రీడా మైదానంలో వరల్డ్ అథ్లెటిక్స్ డే సందర్భంగా బుధవారం జిల్లా స్థాయి అథ్లెటిక్స్ కిడ్స్ పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా వరప్రసాద్‌రావు హాజరై మాట్లాడుతూ క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కోచ్ పర్వతాల కుమారస్వామి, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు వావిలాల ఎల్లయ్య, వావిలాల స్వామి, సంపత్, వెంకటేశ్వర్లు, ఎల్లయ్య, వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యానశాఖ అధికారులు

## మామిడి రైతులకు అవగాహన

మల్హర్, మే 7 : తాడిచెర్లలోని మామిడి రైతులకు కార్బైడ్ రహితంగా మామిడి పండ్లను మాగపెట్టే విధానంపై జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఉద్యానశాఖ, సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా ఉద్యానశాఖ జిల్లా అధికారి ఏ సునీల్ బుధవారం అవగాహన కల్పించారు. పంట కోత సమయంలో తీసుకోవాల్సిన చర్యలు, ఉద్యాన శాఖ ద్వారా అందించే పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ రత్నాకర్‌రావు, డివిజన్ ఉద్యాన అధికారి మణి, ప్రాజెక్ట్ మేనేజర్ రత్నాకర్, ఏవో శ్రీజ, రైతులు సుదాటి రాజేశ్వర్‌రావు, గంగుల రవి, నరేశ్, బండి రాజేందర్, ఓదెలు, కుమార్ పాల్గొన్నారు.

## ఎరగళ్లతో వరి కుప్ప దగ్ధం

వాజేడు, మే 7 : మండలంలోని ధర్మవరం గ్రామానికి చెందిన రైతు గార సత్యనారాయణ 3ఎకరాల్లో యాసంగిలో ఆడ, మగ వరి సాగు చేశాడు. పంట కోసి ఆడ విత్తన బస్తాలను విక్రయించి మగ వరిపంటను కుప్పవేశాడు. బుధవారం అకస్మాత్తుగా పంటపొలాల్లో ఎరగడి(ఎరగళ్ళు) ఏర్పడి వరికుప్ప కాలి బూడిదైపోయింది. చేతికందిన పంట కాలిపోవడంతో రైతు కన్నీటి పర్యంతమయ్యాడు. రూ.30వేల నష్టం ఏర్పడిందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

**శాంతినగర్‌లో మక్కజొన్న పంట..**

చిట్యాల : మండలంలోని కైలాపూర్ శివారు శాంతినగర్ గ్రామంలో రైతు కత్తుల ఓదెలుకు చెందిన మక్కజొన్న పంట ప్రమాదవశాత్తు దగ్ధమైంది. ఓదెలు గ్రామ శివారులో 2 ఎకరాల్లో మక్కజొన్న సాగు చేస్తున్నాడు. రెండు రోజుల క్రితం కంకులు కోసి చేనులోనే వేశాడు. ఈ క్రమంలో బుధవారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి చేనంతా వ్యాపించాయి. కంకులు పూర్తిగా దగ్ధమయ్యాయి. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరాడు.

## ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవాలి

రేగొండ, మే 07 ; కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఫార్మర్ రిజిస్ట్రీని ప్రతి రైతు ఆధార్‌తో అనుసంధానం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి వీరూనాయక్ అన్నారు. గోరికొత్తపల్లి మండలం చిన్నకోడెపాక గ్రామంలోని రైతు వేదికలో ఫార్మర్ రిజిస్ట్రీపై ఏవో సారయ్య ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వీరూనాయక్ మాట్లాడుతూ ప్రతి రైతుకూ 14 అంకెలతో కూడిన గుర్తింపు కార్డు ఇవ్వనున్నట్లు తెలిపారు. దీంతో అనేక రకాల ప్రయోజనాలు పొందవచ్చన్నారు. భూమి కలిగి ఉన్న రైతులు ఆధార్‌కార్డు, పట్టాదార్ పాస్‌పుస్తకం, సెల్‌ఫోన్ తీసుకొని క్లస్టర్ వ్యవసాయ అధికారి వద్దకు వెళ్లి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

## రామాలయ అభివృద్ధికి నగదు విరాళం

గణపురం, మే 7 : మండల కేంద్రంలోని ప్రసిద్ధిగాంచిన శ్రీపట్టాభి సీతారామచంద్రస్వామి ఆలయ అభివృద్ధి కోసం మండల కేంద్రానికి చెందిన మచ్చక ముఖేశ్‌కుమార్ తన తల్లి సారమ్మ జ్ఞాపకార్థం రూ.10వేల విరాళాన్ని ఆలయ కమిటీ అధ్యక్షుడు తాళ్లపల్లి గోవర్ధన్ గౌడ్‌కు బుధవారం అందజేశారు. కార్యక్రమంలో అర్చకుడు ముసునూరి నరేశ్, ఆలయ కమిటీ సభ్యులు బండారు శంకర్, మూల శ్రీనివాస్‌గౌడ్, బటక స్వామి, బూర రాజగోపాల్, మాదాసు అర్జున్, మొగిలి, దయ్యాల భద్రయ్య, పాండవుల భద్రయ్య పాల్గొన్నారు

# రైతు సమగ్ర అభివృద్ధే లక్ష్యం

### ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



రేగొండ : మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

రేగొండ, మే 7 : రైతు సమస్యలు పరిష్కరించి, వారిని అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. ప్రభుత్వం నూతనంగా అమ లు చేసిన భూ భారతి చట్టంపై రేగొండ మండల కేంద్రంతో పాటు భాగిర్థిపేట గ్రామాల్లో తహసీల్దార్ శ్వేత, సత్యనారయణస్వామి ఆధ్వర్యంలో బుధవారం అవగాహన సదస్సులు నిర్వహించి, రైతుల నుంచి ఆర్జీలను స్వీకరించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. గ్రామ సభల్లో దరఖాస్తు చేసుకున్న వారి సమస్యలు పరిష్కరించి, జున్ 2న పట్టా పాస్‌పుస్తకాలు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీటీ రజాక్, ఆర్ఐ భరత్‌రెడ్డి, సిబ్బంది గడ్డం శ్రీకాంత్, మాచర్ల వేణు, మార్కెట్ కమిటీ చైర్మన్ గుంటోజు కిష్టయ్య పాల్గొన్నారు.

**ఆడపడుచులకు అండగా కల్యాణ లక్ష్మి**

చిట్యాల/భూపాలపల్లి రూరల్ : పేదింటి ఆడపడుచులకు అండగా కల్యాణలక్ష్మి, షాదీముబారక్ నిలుస్తోందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ అన్నారు. బుధవారం ఆయన చిట్యాల మండల కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో చిట్యాల, టేకుమట్ల మండలాల పరిధిలోని 47మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందజేశారు. అలాగే భూపాలపల్లి పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అంగన్‌వాడీ సూపర్‌వైజర్లకు ఎలక్ట్రిక్ బైక్‌లు అందజేశారు.

## హత్యాయత్నం ఘటనలో నిందితుడి అరెస్టు



నిందితుడి అరెస్టు చూపుతున్న ట్రైనీ ఎస్సై గీత

కాటారం, మే 7 : పాతకక్షలతో మహిళపై హత్యాయత్నం చేసిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ప్రొబేషనరీ ఎస్సై గీత రాథోడ్ తెలిపిన వివరాల ప్రకారం.. దేవరాంపల్లి గ్రామానికి చెందిన మారుపాక సారయ్యను గత ఏడాది డిసెంబర్ 14న భూతగాదా విషయంలో అతడి సోదరుడు, మరదలు, బంధువులు గొడ్డలితో నరికి చంపారు. అప్పటి నుంచి నిందితులపై సారయ్య కుమారుడు అంజి పగ పెంచుకున్నాడు. ఆ కేసులో నిందితులు ఇటీవల బెయిల్‌పై బయటికి రాగా, అందులో ఒకరైన మారుపాక లక్ష్మి మంగళవారం కాటారం పోలీస్‌స్టేషన్ వైపు నడుచుకుంటూ వెళ్తుండగా అంజి ఆమెపై గొడ్డలితో దాడి చేశాడు. దీంతో లక్ష్మి తలకు, పలు చోట్ల తీవ్రగాయాలయ్యాయి. చుట్టుపక్కల వారు గుమికూడడంతో అంజి పారిపోయాడు. మండల కేంద్రంలోని మంథని రోడ్డులో పెట్రోల్ బంక్ వద్ద తనిఖీలు చేస్తుండగా బస్సులోవస్తూ అంజి పోలీసులకు దొరికాడు. అతడి నుంచి గొడ్డలి స్వాధీనం చేసుకొని అరె స్టు చేసినట్లు ఎస్సై తెలిపారు. సమావేశంలో హెడ్ కానిస్టేబుల్ కృష్ణ, కానిస్టేబుళ్లు రఘు, జంపన్న, సురేశ్, దేవేందర్, సంపత్, హోంగార్డు తిరుపతి పాల్గొన్నారు.

## ఘనంగా వాసవీ జయంతి వేడుకలు



ఏటూరునాగారం : వేడుకల్లో పాల్గొన్న ఆర్యవైశ్యులు

ఏటూరునాగారం/వెంకటాపూర్/టేకుమట్ల, మే 7 : వాసవీ కన్యకా పరమేశ్వరి జయంతి ఉత్సవాలను బుధవారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏటూరునాగారంలో జరిగిన కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు బచ్చు సతీశ్, కార్యదర్శి గంజి రమేశ్, అయ్యప్ప ఆలయ కమిటీ చైర్మన్ బొలసాని గౌరీశంకర్, గుంత రమేశ్, బచ్చు సత్యనారాయణ, వెలగందుల మాధవ్, సిరిపురం చంద్రశేఖర్, గంజి స్వామి, గంజి సాంబశివరావు, దుర్గేశ్వర్‌రావు, పంచాయతీ రాజ్ ఉద్యోగుల సంఘం జిల్లా కన్వీనర్ మడుగూరి నాగేశ్వర్‌రావు, ప్రసాద్, సందీప్, మడుగూరి శ్రీనువాస్, రామాలయం కమిటీ చైర్మన్ అలువాల శ్రీనివాస్ పాల్గొన్నారు. అలాగే, వెంకటాపూర్ మండలంలోని నల్లగుంట కృష్ణాలయంలో రామప్ప వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో కుంకుమ పూజలు నిర్వహించారు. ఆర్యవైశ్య మహాసభ ములుగు జిల్లా అధ్యక్షుడు కొమురవెల్లి రమేశ్, భూపాలపల్లి రూరల్ మండల అధ్యక్షుడు శ్రీరాం రమేశ్, మండలాధ్యక్షుడు కొమురవెల్లి కోటిలింగం, వాసవీ క్లబ్ అధ్యక్షుడు కటకం శివకుమార్, రేపాల సత్యనారాయణ, కొండ్లె కృష్ణమూర్తి, కటకం సతీశ్, శిటికేశి చంద్రశేఖర్, కొమురవెల్లి శ్రీనివాస్, రాజు, ఓమ సాంబయ్య, ఇమ్మడి సత్యనారాయణ, వంశీకృష్ణమాచార్యులు, నరేంద్ర స్వామి పాల్గొన్నారు. టేకమట్ల మండల కేంద్రంలోని వాసవి కన్యకాపరమేశ్వరీ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైశ్యులు రావికంటి చంద్రమౌళి, దొడ్డ మల్లికార్జున్, శేషాద్రి, గుండా ప్రభాకర్, రేణుకుంట్ల రాజయ్య, శ్రీధర్, సంపత్, వేణు పాల్గొన్నారు.

## టస్సార్ కాలనీని సందర్శించిన ఏపీ మహిళలు



చేనేత కార్మికులతో మాట్లాడుతున్న ఆంధ్రప్రదేశ్ మహిళలు

మహదేవపూర్, మే 7 : మండల కేంద్రంలోని టస్సార్(దసలిపట్టు) కాలనీని బుధవారం ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా సహాయ పట్టుపరిశ్రమ అధికారి జీవీ హరికృష్ణ ఆధ్వర్యంలో చింతూర్, రంపచోడవరానికి చెందిన సుమారు 60మంది మహిళలు సందర్శించారు. చేనేత కార్మికులు తయారు చేసిన వస్త్రాలను పరిశీలించారు. కాలనీకి చెందిన చేనేత కార్మికులు గొర్రె బాపు, శంకరయ్య శ్రీనివాస్ దసలి పట్టు పరిశ్రమ, టస్సార్ (దసలిపట్టు)దారం తీసే విధానం, మగ్గాలపై చీరెలు నేసే విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో సెరికల్చర్ మండల అధికారి సమ్మయ్య, పట్టుపరిశ్రమ సాంకేతిక సహాయకుడు రవి కుమార్, సారయ్య, చేనేతకార్మికులు పాల్గొన్నారు.

## సమ్మె నోటీసులు అందజేత

ములుగురూరల్, మే 7 : దేశవ్యాప్తంగా ఈ నెల 20న జరుగుతున్న సార్వత్రిక సమ్మె నోటీసులను బుధవారం హమాలీలు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ ఆధ్వర్యంలో సివిల్ సప్లయ్ డీఎం రాంపతికి అందజేశారు. కేంద్ర ప్రభుత్వం కార్మికులకు ఉపయోగపడే 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్స్‌గా కుదించడం వలన అన్యాయం జరుగుతోందన్నారు. సమ్మెలో కార్మికులు, కర్షకులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో హమాలీ కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి మొలుగూరి రాంబాబు, ములుగు గోదాం అధ్యక్షుడు రొంటాల రమేశ్ పాల్గొన్నారు.

# వాజేడు, వెంకటాపురంలో మంత్రి పొంగులేటి పర్యటన



వాజేడు : మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

వాజేడు/వెంకటాపురం(నూగూరు), మే 7 : వాజేడు మండలంలోని టేకులగూడెం, వాజేడు, నాగారం, ఎడ్జర్లపల్లి గ్రామాల్లో బుధవారం రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు పర్యటించారు. టేకులగూడెం గ్రామంలో పైలట్ ప్రాజెక్ట్‌గా 106 మంది లబ్ధిదారుల ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. రూ.1.50 కోట్ల వ్యయంతో ఎంపీడీవో నూతన కార్యాలయ భవన నిర్మాణ పనుల శిలాఫలకం ఆవిష్కరించారు. నాగారం విద్యుత్‌సబ్‌స్టేషన్ నుంచి పాయబాట్ల గ్రామం వరకు రూ.4కోట్ల అంచనా వ్యయంతో రహదారి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఎడ్జర్లపల్లి నుంచి బొమ్మనపల్లి వరకు రూ.3కోట్లతో బీటీ రహదారి నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అలాగే, పీహెచ్‌సీలో పుట్టిన శిశువులు వేచి ఉండే గదిని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. అనంతరం బయటకు వచ్చిన మంత్రి శ్రీనివాసరెడ్డిని ఇటీవల మావోయిస్టుల చేతిలో హత్యకు గురైన పేరూరు పంచాయతీ కార్యదర్శి ఉయిక రమేశ్ భార్య రాంబాయి, అర్జున్ భార్య సావిత్రి కలిసి తమకు ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ఎలాంటి సాయం అందలేదని తెలిపారు. దీనికి స్పందించిన మంత్రి సాయం అందేలా చూస్తానని తెలిపారు. కాగా, అర్హులైన తమకు ఇందిరమ్మ ఇండ్లు రాలేదని పలువురు మహిళలు నిలదీయడంతో అందరికీ దశలవారీగా ఇస్తామని సముదాయించారు. కార్యక్రమంలో కలెక్టర్ టీఎస్ దివాకర, ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా, ఎస్పీ శబరీష్, ఏటూర్‌నాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, డీఎఫ్‌వో రాహూల్‌కిషన్‌జాదవ్, డీఎస్పీ నాలవాల రవీందర్, వెంకటాపురం సీఐ బండారు కుమార్, వాజేడు ఎస్సై రాజ్‌కుమార్ పాల్గొన్నారు. అలాగే, వెంకటాపురం(నూగూరు) మండలంలో రూ.60లక్షల నిధులతో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ సబ్ డివిజన్ కార్యాలయ భవనానికి మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం పాత్రాపురంలోని రైతు వేదికలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు మంజూరు ప్రతాలు అందజేశారు. తహసీల్దార్ లక్ష్మీరాజయ్య, ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



మహదేవపూర్ : ర్యాలీ నిర్వహిస్తున్న వివిధ సంఘాల నాయకులు

## భారత ఆర్మీకి మద్దతుగా ర్యాలీ

మహదేవపూర్/ములుగురూరల్,మే 7 : భారత ఆర్మీకి మద్దతుగా వివిధ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల నేతల ఆధ్వర్యంలో మండల కేంద్రంలో బుధవారం జాతీయ జెండాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. పాకిస్తాన్‌పై భారత ఆర్మీ దాడి తీరును ప్రశంసించారు. కార్యక్రమంలో నాయకులు కన్నెబోయిన ఐలయ్య, నెన్నల గట్టయ్య , రవిచందర్, ప్రజా సంఘాల నేతలు బెల్లంపల్లి సురేశ్, సాగర్ల రాజు, శంకర్,వెంకటేష్, గడ్డం స్వామి పాల్గొన్నారు. అలాగే, ములుగులో కూడా బీజేపీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. జాతీయ రహదారిపై పటాకులు కాల్చారు. సిరికొండ బలరాం, చింతలపూడి భాస్కర్‌రెడ్డి, కొత్త సురేందర్, కృష్ణాకర్‌రావు, రాకేశ్ పాల్గొన్నారు.

## జనాల మీదికి దూసుకొచ్చిన వాహనం

ములుగురూరల్, మే 7 : జనాల మీదికి భారీ వాహనం తీసుకొచ్చిన ఘటన ములుగు జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద జాతీయ రహదారిపై బుధవారం ఉదయం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. జాతీయ రహదారిపై జంగాలపల్లి వైపు రోడ్ లెవల్ వాహన డ్రైవర్ బస్టాండ్ యూ టర్న్ వద్ద వేగంగా వచ్చి ఆగి ఉన్న వాహనాలను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో కారుతోపాటు పార్క్ చేసి ఉన్న బైక్‌లు ధ్వంసయ్యాయి. దీంతోపాటు బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని ఢీకొనడంతో అతడు టైర్ల కింద పడిపోయారు. స్థానికులు అప్రమత్తమై అతడిని రక్షించారు. ఈ ప్రమాదంలో మహిళలకు సైతం గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని స్టేషన్‌కు తరలించినట్లు తెలిసింది.

## ఉరేసుకొని ఒకరి ఆత్మహత్య

వెంకటాపూర్, మే 7: అనారోగ్యంతో బాధపడుతున్న ఒకరు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఎస్సై సతీశ్ కథనం ప్రకారం.. మండలంలోని నల్లగుంట గ్రామానికి చెందిన మునిగంటి తిరుపతిరెడ్డి(42)కి ఆరేళ్ల క్రితం డిస్క్ ఆపరేషన్ జరిగింది. దీంతో పాటు కిడ్నీలు ఫెయిల్ అయ్యాయి. షుగర్ తదితర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. అయితే, సోమవారం అతడి భార్య కీర్తన, కుమారుడు హర్షవర్ధన్ రెడ్డి ఊరికి వెళ్లారు. కాగా, మంగళవారం ఉదయం వరకు అతడు లేవకపోవడంతో ఇంట్లో చూసే సరికి ఉరి వేసుకుని ఉన్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## చికిత్స పొందుతూ మహిళ మృతి

రేగొండ, మే 7 : కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకొన్న మహిళ చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్సై సందీప్‌కుమార్ తెలిపారు. రేగొండ మండలం తిరుమలగిరి గ్రామానికి చెందిన కంచరకుంట్ల శ్రీలత(38) భర్తతో గొడవపడి గత ఏడాది డిసెంబర్‌లో ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకుంది. కుటుంబ సభ్యులు దవాఖానకు తరలించగా నాలుగు నెలలుగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత

తాడ్వాయి, మే 7 : అనుమతి లేకుండా అక్రమంగా రెండు బొలేరో వాహనాల్లో తరలిస్తున్న 14 పశువులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఆయన వివరాలను వెల్లడించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాకకు చెందిన ఒడియాల వెంకన్న, ములుగు జిల్లా రమణక్కపేటకు చెందిన మాందారపు సాంబశివరావు అక్రమంగా పశువులను రవాణా చేస్తున్నట్లు సమాచారం అందడంతో 163వ జాతీయ రహదారిపై తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా రెండు వాహనాల్లో 14 పశువులను గుర్తించి వాహనాలతోపాటు పశువులను స్వాధీనం చేసుకుని సదరు వ్యక్తులపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. పశువులను రాంపూర్ గోశాలకు తరలించినట్లు ఎస్సై వివరించారు.

## ఫోన్లు హ్యాక్.. రూ.63 వేలు మాయం

కాటారం, మే 7 : ఫోన్లను హ్యాక్ చేసి, సైబర్ మోసగాళ్లు రెండు ఖాతాల నుంచి రూ.63వేలు కొల్లగొట్టిన ఘటన కాటారం మండలంలోని గుమ్మళ్లపల్లిలో చోటు చేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కంకణాల సురేందర్ రెడ్డి-స్రవంతి ఫోన్లకు అపరిచిత నంబర్ల నుంచి సందేశాలతో కూడిన లింక్‌లు వచ్చాయి. ఇది గమనించని వీరి కూతురు ఫోన్‌లో ఆడుకుంటూ రెండు ఫోన్లలోని లింక్‌లను ఓపెన్ చేసింది. దీంతో సురేందర్‌రెడ్డి ఖాతా నుంచి రూ.33 వేలు, స్రవంతి ఖాతా నుంచి రూ.30వేలు కట్ అయినట్లు సందేశాలు వచ్చాయి. ఆందోళనకు గురైన సురేందర్‌రెడ్డి ఫోన్లు హ్యాక్ అయినట్లు గుర్తించి, బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

భూపాలపల్లి రూరల్, మే 7: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని భూపాలపల్లి ఎస్సై సాంబమూర్తి అన్నారు. సైబర్ జాగృతి దివస్ కార్యక్రమంలో భాగంగా అంబేద్కర్ స్టేడియంలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్ట్‌టైం టాస్క్ బేస్డ్ ఇన్వెస్ట్‌మెంట్ మోసాలు, జాబ్ ఫ్రాడ్స్ , ఆన్‌లైన్ షాపింగ్ మోసాలు, నకిలీ ఇన్‌స్టాగ్రాం, వెబ్‌సైట్ మోసాల గురించి వివరించారు. కార్యక్రమంలో భూపాలపల్లి పోలీస్‌స్టేషన్ అడ్మిన్ ఎస్సై సాంబమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

## బాల్య వివాహాలను నిరోధించాలి

గోవిందరావుపేట, మే 7 : గ్రామాల్లో బాల్య వివాహాలను నిరోధించాలని జిల్లా బాలల పరిరక్షణ విభాగం సోషల్ వర్కర్ బీ జ్యోతి అన్నారు. కోటగడ్డ జీపీ కార్యాలయంలో కార్యదర్శి లలిత అధ్యక్షతన బాలల హక్కులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతి మాట్లాడుతూ పిల్లలకు ఎలాంటి సమస్య వచ్చినా 1098, 112 నంబర్లకు కాల్ చేయాలని సూచించారు. బాలలపై లైంగిక వేధింపులు జరుగకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

## ఐదుగురు మావోయిస్టుల లొంగుబాటు

ములుగు రూరల్, మే 7 : ములుగు జిల్లా ఎస్పీ డాక్టర్ పీ శబరీశ్ ఎదుట బుధవారం మావోయిస్టు పార్టీకి చెందిన ఐదుగురు సభ్యులు లొంగిపోయారు. ఈ మేరకు ఎస్పీ వారిని చూపడంతో పాటు వివరాలు వెల్లడించారు. కోమటిపల్లి ఆర్‌పీసీ సభ్యుడు మడావి భీమా, ఆర్‌పీసీ జంగిల్ శాఖ సభ్యుడు మడావి కోస, ఆర్‌పీసీ ఆర్‌కేఏఎంఎస్ సభ్యుడు మడివి భీమా, ఆర్‌పీసీ సభ్యుడు వంజం ఊర, ఆర్‌పీసీ చైతన్య నాట్య మండలి సభ్యురాలు వంజం హుంగి లొంగిపోయిన వారిలో ఉన్నారని తెలిపారు. 'పోరు కన్నా ఊరు మిన్న , మన ఊరికి తిరిగి రండి' కార్యక్రమంలో భాగంగా హింసాత్మక మావోయిస్టు మార్గాన్ని వదిలిపెట్టి కుటుంబంతో కలిసి ప్రశాంతమైన జీవితాన్ని గడపాలని నిర్ణయించుకొని సదరు మావోయిస్టులు లొంగిపోయినట్లు తెలిపారు. అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులు జన జీవన స్రవంతిలో కలవాలని విజ్ఞప్తి చేస్తూ వివిధ పద్ధతుల్లో, మాధ్యమాల ద్వారా మావోయిస్టులకు సమాచారం అందిస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం ఎస్పీ లొంగిపోయిన ఐదుగురికి రూ.25వేల చొప్పున తక్షణ సహాయాన్ని అందజేశారు.



లొంగిపోయిన మావోయిస్టులను చూపి వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ శబరీశ్